## యూనిట్ 4   14. చెట్టు సాక్ష్యం

**చిత్రం చూడండి - ఆలోచించండి - మాట్లాడండి**



★ చిత్రం చూడండి. చిత్రంలో ఏం జరుగుతూ ఉందో చెప్పండి.

★ ఇలాంటి సన్నివేశం ఎక్కడ జరుగుతుంది? ఎందుకోసం జరుగుతుంది?

**పిల్లలకు సూచనలు :**

★ పాఠంలోని చిత్రాలను చూడండి. చిత్రాలను గురించి మాట్లాడండి.

★ పాఠాన్ని చదవండి. అర్థంకాని పదాలకింద గీత గీయండి.

★ గీత గీసిన పదాలకు అర్థాలను మీ మిత్రులను గాని, ఉపాధ్యాయులను గాని అడిగి లేదా పదాలు - అర్థాలు అన్న పట్టికలో చూసి తెలుసుకోండి.



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంవారిచే ఉచిత పంపిణీ



అవంతీపురంలో ధనగుప్తుడు, నందిగుప్తుడు అనే వర్తకులు ఉండేవాళ్ళు. వాళ్ళు పొరుగుదేశాలకు వెళ్ళి వ్యాపారంచేసేవాళ్ళు. వాళ్ళ వ్యాపారం మూడు పువ్వులూ ఆరు కాయలుగా అభివృద్ధి చెందింది. బాగా డబ్బు సంపాదించారు. తమ నగరానికి తిరిగి వచ్చారు. వ్యాపారం వాళ్ళకు వెన్నతో పెట్టిన విద్య. ఇద్దరూ మరో వ్యాపారం చేయాలనుకున్నారు. అంత వరకు సొమ్ము దాచాలి. "ధనానికి దాపరికం, సేద్యానికి వెల్లడి" అన్నారు కదా! సొమ్ము ఎక్కడ దాచాలాని ఆలోచించారు. చివరికి ఊరిబయట చెట్టుకింద దాచాలనుకున్నారు. ఇద్దరూ కలిసి వెళ్ళారు. చెట్టుకింద గొయ్యి తవ్వారు, డబ్బు దాచారు.

"డబ్బుకు లోకం దాసోహం" అని ధనగుప్తుడి నమ్మకం. అతనికి దురాశ పుట్టింది. మొత్తంసొమ్ము తానే కాజేయాలనుకున్నాడు. ఒకనాటి రాత్రి చెట్టుదగ్గరికి వెళ్ళి ధనమంతా తెచ్చుకున్నాడు. ఇంట్లో దాచాడు. 'ఉలుకూ పలుకూ లేకుండా' ఊరుకున్నాడు.

కొద్దిరోజుల తరవాత స్నేహితులిద్దరూ డబ్బు తెచ్చుకోవాలనుకున్నారు. కలిసి చెట్టు దగ్గరికి వెళ్ళారు. ధనగుప్తుడు మాత్రం "తేలుకుట్టిన దొంగ" లా చూస్తూ నిలుచున్నాడు. నందిగుప్తుడే గోతిని తవ్వాడు. అందులో సొమ్ము లేదు. ఆశ్చర్యపోయాడు. స్నేహితుడివైపు తిరిగాడు. అన్నీ తెలిసిన ధనగుప్తుడు కోపం నటించాడు. "నోరుంటే పొరు గెలుస్తుంద"ని నందిగుప్తుడిమీద విరుచుకుపడ్డాడు. "నువ్వే ద్రోహబుద్ధితో మొత్తం సొమ్ము కాజేశావు. ఇప్పుడు 'నక్కవినయాలు నటిస్తున్నావు' " అన్నాడు. ధనగుప్తుడి మాటలకు నందిగుప్తుడికి కూడా కోపం వచ్చింది. 'ధర్మానికి పోతే కర్మం చుట్టుకున్నది' అన్నట్లుంది వరస. నన్నే దొంగ అంటావా!" ఇలా ఇద్దరు పోట్లాడుకున్నారు. తగువు తెగలేదు. తీర్పు కోసం రాజు దగ్గరికి వెళ్ళారు.

ధనగుప్తుడు, నందిగుప్తుడు ఇద్దరూ విషయాన్ని రాజుకు వివరించారు. నందిగుప్తుడే ధనం దొంగిలించాడనటానికి ఆధారమేమిటని అన్నాడు రాజు. “దొంగకు ధైర్య మెక్కువ” అన్నట్లు ధనగుప్తుడు, ‘జంకు, కొంకు’ లేకుండా నిలబడ్డాడు. ఇందుకు చెట్టే సాక్ష్యం చెప్తుంది. కావాలంటే పరీక్షించుకోండి. ‘నిజం నిలకడమీద తెలుస్తుంది’ ” అన్నాడు. మరునాటి ఉదయం చెట్టుదగ్గరికి వెళ్ళి పరీక్షించాలని నిర్ణయించుకున్నారు.

ధనగుప్తుడు ఇంటికి వచ్చాడు. జరిగిందంతా తన తండ్రికి చెప్పాడు. “చెట్టుకు తొర్ర ఉంది. అందులో దాక్కొని, రాజు అడిగినప్పుడు సాక్ష్యం చెప్ప”మని అతను తన తండ్రిని కోరాడు. “నమ్మిన మిత్రునికి ద్రోహం చేయగూడదు” అని తండ్రి ధనగుప్తుడికి బుద్ధి చెప్పాడు. కానీ ధనగుప్తుడు తండ్రిమాటలను పెడచెవిన పెట్టాడు. పోగాలం దాపురించినవారికి పెద్దల మాటలు చెవికెక్కవు కదా! తండ్రి ఏమీ చేయలేకపోయాడు. దైవంమీద భారంవేసి, ఉదయమే వెళ్ళి చెట్టుతొర్రలో దాక్కొన్నాడు.

మరునాడు రాజుగారు తన పరివారంతో చెట్టుదగ్గరికి వెళ్ళాడు. రాజు చెట్టును చూసి “ఓ వృక్షరాజమా! వీళ్ళిద్దరూ నీదగ్గర దాచిన సొమ్ము ఏమైంది? చెప్పు” అని అడిగాడు. అప్పుడు చెట్టుతొర్రలోనుంచి “మహారాజా! నందిగుప్తుడే ఆ సొమ్ము కాజేసి తీసుకువెళ్ళాడు. ధనగుప్తుడు ఏ పాపమూ ఎరగడు,” అనే మాటలు వినిపించాయి. రాజు ఆశ్చర్యపోయాడు. ఒక్కక్షణం ఆలోచించాడు. భటులను పిలిచి చెట్టు తొర్రలో గడ్డివేసి పొగపెట్టమన్నాడు. ఆ పొగకు ఊపిరి సలపక ధనగుప్తుడి తండ్రి వెలుపలికి వచ్చాడు. జరిగిందంతా ‘పూసగుచ్చినట్లు’ చెప్పాడు. “ ‘కడుపుతీపి’ తో ‘బుద్ధిగడ్డితిని’ నా కుమారుడి మాట విన్నాను. నన్ను క్షమించండి,” అని కోరాడు. రాజు ధనగుప్తుడికి శిక్ష విధించాడు. నందిగుప్తుడికి రావలసిన సొమ్మును ఇప్పించాడు. ధనగుప్తుడి తండ్రిని మన్నించి వదిలివేశాడు.

© SCERT
not to be republished





## ఇవి చేయండి



### I వినండి - ఆలోచించి చెప్పండి



(అ) కథను సొంతమాటల్లో చెప్పండి.

(ఆ) కథకు ఎందుకా పేరు పెట్టి ఉంటారో చెప్పండి.

(ఇ) మీకు తెలిసిన సామెతలు చెప్పండి. వాటి అర్థం వివరించండి.

(ఈ) "ధనానికి దాపరికం - సేద్యానికి వెల్లడి" ఇది ఒక సామెత. "కడుపుతీపి", "బుద్ధి గడ్డితిని" వీటిని జాతీయాలు అంటారు. సామెతలకు, జాతీయాలకు మధ్య తేడా ఏమిటో చెప్పండి.

### II చదవండి - అర్థం చేసుకొని చెప్పండి - రాయండి



(అ) కింది పేరాలో కొన్ని జాతీయాలు, సామెతలు ఉండవలసిన చోట లేవు. పాఠాన్ని చదివి సరిచేసి రాయండి.

అవంతీపురంలో ధనగుప్తుడు, నందిగుప్తుడనే వర్తకులుండేవాళ్ళు. వాళ్ళు పొరుగుదేశాలకు వెళ్ళి వ్యాపారం చేసేవాళ్ళు. వాళ్ళ వ్యాపారం '**ఉలుకు పలుకు**'గా అభివృద్ధి చెందింది. వ్యాపారం వాళ్ళకు '**వెన్నతో పెట్టిన విద్య**'. ఇద్దరూ వేరొక వ్యాపారం చేయాలనుకున్నారు. అంతవరకు సొమ్ము దాచాలి. '**డబ్బుకు లోకం దాసోహం**' అని ఇద్దరూ కలిసి వెళ్ళారు. చెట్టుకింద గొయ్యి తవ్వి డబ్బు దాచారు.

'**ధనానికి దాపరికం - సేద్యానికి వెల్లడి**' అని ధనగుప్తుడి నమ్మకం. అతనికి దురాశ పుట్టింది. ఒకనాటి రాత్రి చెట్టు దగ్గరికి వెళ్ళి ధనమంతా తెచ్చుకున్నాడు. '**మూడు పువ్వులు ఆరుకాయలు**'గా లేకుండా ఊరుకున్నాడు.

(ఆ) పాఠం చదవండి. ధనగుప్తుడికి వర్తించే సామెతలు, జాతీయాలు ఏమి ఉన్నాయో వాటిని గుర్తించండి.

(ఇ) కింది ప్రశ్నలకు సమాధానాలు రాయండి.

1. రాజు చెట్టుకు ఎందుకు పొగపెట్టాలనుకున్నాడు?
2. చెట్టు సాక్ష్యం చెప్పిందా? ఎలా తెలుసుకోవచ్చు?
3. ధనగుప్తుడు ఎటువంటివాడు?
4. కథలో ఎవరు మోసగాడు? ఎందుకు?

(ఈ) కథలోని సామెతలకు, 'O' చుట్టండి. జాతీయాలకింద గీతగీయండి.

© SCERT not to be republished

## III రాయండి




(అ) కథను సొంతమాటల్లో రాయండి.

(ఆ) రాజు ధనగుప్తుడి తండ్రిని మన్నించి ఎందుకు వదిలేశాడు?

(ఇ) కథ ఆధారంగా నందిగుప్తుడి స్వభావాన్ని గురించి రాయండి.

(ఈ) "నమ్మిన మిత్రునికి ద్రోహం చేయకూడదు." అనే వాక్యాన్ని బట్టి మీరేం గ్రహించారు?


## IV పదజాలం



(అ) ఆధారాలతో గడులు నింపండి.


**ఆధారాలు**

1. గాలినిచ్చే కర్ర
2. తెలివిలేనివాడు
3. బహుమతికి మరో పదం
4. సంతోషానికి మరో పదం
5. చలికి కప్పుకొనేది
6. వెలుగునిచ్చేవాడు




(ఆ) కింది జాతీయాలు, పదాలను ఉపయోగించి సొంతవాక్యాలు రాయండి. బుద్ధి గడ్డి తిని, ఉలుకు పలుకు, కడుపు తీపి, జంకూ కొంకూ, నక్కవినయం, సాక్ష్యం, దాపరికం, పరివారం.

## V సృజనాత్మకత



(అ) చెట్టు సాక్ష్యం కథను సంభాషణ రూపంలో రాయండి. నాటకీకరణ చేయండి.


(ఆ) కింది జాతీయాలు ఉండేలా కొత్త కథను / సంఘటనను రాయండి.

కథలు చెప్పడం, నాటకాలు ఆడడం, శఠగోపం పెట్టడం, మాటలు నేర్పడం, చుక్కలు చూపించాడు, కడిగేయడం, హారతి కర్పూరం, మంగళం పాడడం, కడుపు మంట, కళ్లు తెరిచాడు.

(ఇ) చెట్టు సాక్ష్యం కథను పొడిగించి రాయండి.

© SCERT

## VI ప్రశంస / ప్రాజెక్టు పనులు



(అ) కొన్ని సామెతలను సేకరించండి. రాసి చదివి వినిపించండి.

(ఆ) కొన్ని జాతీయాలను సేకరించండి. రాసి చదివి వినిపించండి.

(ఇ) సామెతలు, జాతీయాలకు సంబంధించిన కథలు సేకరించండి. అడిగి తెలుసుకోండి. వాటిని మీ మీ భాషల్లో చెప్పండి.

## VII భాషను గురించి తెలుసుకుందాం



**(అ) కింది వాక్యాలను చదవండి.**

1) వర్షాలు బాగా కురిశాయి. పంటలు బాగా పండాయి.

2) వర్షాలు బాగా కురిశాయి కాబట్టి పంటలు బాగా పండాయి.

ఒక వాక్యంలో ఒకే సమాపక క్రియ ఉంటే ఆ వాక్యాన్ని **సరళవాక్యం** అంటారు.

ఒక వాక్యంలో రెండు సమాపక క్రియలు ఉంటే ఆ వాక్యాన్ని **సంయుక్త వాక్యం** అంటారు.

రెండు సరళ వాక్యాలను సంయుక్త వాక్యాలుగా రాసేటప్పుడు 'కానీ', 'అందువల్ల' లేదా 'కాబట్టి', 'ఐనా' ఇలాంటి పదాలు రెండు వాక్యాలను కలపడానికి ఉపయోగిస్తారు.

**(ఆ) కింది ఉదాహరణలు గమనించండి.**

1) రైలు వచ్చింది. చుట్టాలు రాలేదు. (సరళ వాక్యాలు)

2) రైలు వచ్చింది కానీ చుట్టాలు రాలేదు. (సంయుక్త వాక్యం)

1) రమ సంగీతం నేర్చుకుంది. నృత్యం నేర్చుకుంది. (సరళ వాక్యాలు)

2) రమ సంగీతమూ నృత్యమూ నేర్చుకుంది. (సంయుక్త వాక్యం)

**(ఇ) కింది సరళ వాక్యాలను సంయుక్త వాక్యాలుగా మార్చి రాయండి.**

1. లక్ష్మి ఐస్‌క్రీం తెచ్చింది. లక్ష్మి ఐస్‌క్రీం తినలేదు.
2. ఈ సంవత్సరం డబ్బులు బాగా వచ్చాయి. ఇల్లు కొన్నాను.
3. హసన్ బంతి తెచ్చాడు. జంగు బాట్ తెచ్చాడు.
4. సల్మా, రోజీ ఇంటికి వెళ్ళింది. సల్మా గీత ఇంటికి వెళ్ళింది.



### నేనివి చేయగలనా ?



| | |
|---|---|
| 1. చెట్టు సాక్ష్యం కథను సొంతమాటల్లో చెప్పగలను. | ఔను/కాదు |
| 2. పాఠాన్ని ధారాళంగా చదవగలను. సామెతలనూ, జాతీయాలనూ గుర్తించగలను. | ఔను/కాదు |
| 3. కథను సొంతమాటల్లో రాయగలను. | ఔను/కాదు |
| 4. కథను సంభాషణలోకి మార్చి రాయగలను. | ఔను/కాదు |

© SCERT not to be republished